సాక్షి అనంతపురం

ఆదివారం । 28 । జూలై । 2024



చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16 వేలు పలికాయి.



టమాట కిలో రూ.27

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.27 పలికింది. కనిష్టం రూ.13, సరాసరి రూ.20 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

34.4°/23.7°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 10 నుంచి 18 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నింబగల్లు హెడ్ రెగ్యులేటర్‌కు తుంగభద్ర జలాలు



నింబగల్లు హెడ్ రెగ్యులేటరీ వద్ద జలాలు

ఉరవకొండ: మండల పరిధిలోని నింబగల్లు వద్ద ఉన్న హెచ్చెల్సీ హెడ్ రెగ్యులేటరీ వద్దకు తుంగభద్ర జలాలు చేరాయి. ఈనెల 22న కర్ణాటక రాష్ట్రంలోని తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి నీరు విడుదలైన విషయం తెలిసిందే. డ్యాం నుంచి కణేకల్లు చిక్కణ్ణేశ్వర వడియార్ చెరువుకు నీరు చేరగా, అక్కడి నుంచి 300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో నింబగల్లు హెడ్ రెగ్యులేటరీకి తుంగభద్ర జలాలు చేరాయి. ఈ నీటిని మోపిడి వద్ద హెచ్చెల్సీ ప్రధాన కాలువపై ఉన్న పీఎబీఆర్ లింక్ చానల్ ద్వారా నేరుగా తాగునీటి అవసరాలకు మళ్లించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పారిశుధ్య నిర్వహణపై స్పెషల్ డ్రైవ్

అనంతపురం రూరల్: పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సమస్యలపై ఆగస్టు 10 వరకు అన్ని పంచాయతీల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి మండల పరిషత్ అధికారులు, పంచాయతీ అధికారులు గ్రామాల్లో పర్యటించాలన్నారు. పారిశుధ్య, తాగునీటి సమస్యలపై వచ్చే ఫిర్యాదులను స్వీకరించాలన్నారు. గ్రామ స్థాయిలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఏఎన్ఎంలతో పర్యవేక్షక కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీ పాలకమండలి సభ్యులు, మండల, గ్రామ స్థాయి అధికారులు సమష్టిగా పని చేసి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు.

తహసీల్దార్ల రిలీవ్



అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇతర జిల్లాల నుంచి జిల్లాకు బదిలీపై వచ్చిన 35 మంది తహసీల్దార్లను కలెక్టర్ వి.వినోద్ కుమార్ రిలీవ్ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులను శనివారం జారీ చేశారు.దీంతో వారంతా సొంత జిల్లాలకు వెళ్లారు. రిలీవ్ అయిన తహసీల్దార్ల స్థానంలో ఇన్‌చార్జ్ బాధ్యతలను ఆయా మండలాల రెగ్యులర్ డిప్యూటీ తహసీల్దార్లకు అప్పగించారు. అనంతపురం ఆర్డీఓ కార్యాలయ పరిపాలన బాధ్యతలను డిప్యూటీ తహసీల్దారు కె.పద్మావతికి అప్పగించారు. కలెక్టరేట్ పరిపాలన విభాగం సూపరింటెండెంట్ ఇన్‌చార్జి బాధ్యతను డిప్యూటీ తహసీల్దారు అంజనేయులుకు, కో–ఆర్డినేషన్ విభాగం సూపరిటెండెంట్ ఇన్‌చార్జ్ బాధ్యతలను డీ–1 అసిస్టెంట్ ఎం.బాషాకు అప్పగించారు. ఇదిలా ఉండగా జిలా నుంచి ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దార్లు ఇంకా ఇక్కడ రిపోర్ట్ చేసుకోలేదు. వారు జిల్లాకు చేరుకుని రిపోర్ట్ చేసుకున్న తరువాత కలెక్టర్ మండలాలకు పోస్టింగ్ ఇస్తారు.

బతుకుపై గుదిబండ

గతం ఘనం.. ప్రస్తుతం అధ్వానం అన్న చందాన గ్రానైట్ రంగం పరిస్థితి తయారైంది. ఒకప్పుడు వెలుగు వెలిగిన ఈ పరిశ్రమ క్రమంగా ప్రాభవం కోల్పోతోంది. టైల్స్ అందుబాటులోకి రావడం గ్రానైట్ రంగానికి శరాఘాతంగా మారింది. ఈ క్రమంలో ఉపాధి కరువై కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



గ్రానైట్ బండను పాలిష్ చేస్తున్న కార్మికుడు

- ప్రాభవం కోల్పోతున్న గ్రానైట్ పరిశ్రమ
- టైల్స్ దెబ్బతో కుదేలు
- ఉపాధి కోల్పోతున్న కార్మికులు
- పొట్ట చేతబట్టుకుని స్వస్థలాలకు పయనం

తాడిపత్రి రూరల్: తాడిపత్రి పరిసర ప్రాంతాల్లో గ్రానైట్ పరిశ్రమ బాగా అభివృద్ధి చెందింది. ఇక్కడ నెలకొల్పిన గ్రానైట్ బండల తయారీ యూనిట్లు వేల సంఖ్యలో కార్మికులకు ఉపాధి కల్పించేవి. రాయలసీమలోని పలు ప్రాంతాలతో పాటు ఉత్తరాదికి చెందిన పలు రాష్ట్రాల కార్మికులు వీటిలో పనిచేసేవారు. వ్యవసాయ పనుల్లో వచ్చే ఆదాయంతో పోల్చుకుంటే కూలి ఎక్కువగా ఉండటంతో కుటుంబాలతో సహా వచ్చి ఉపాధి పొందేవారు. గ్రానైట్ యూనిట్ల నిర్వాహకులు రూ. వేలకు వేలు అడ్వాన్సులు చెల్లించి కార్మికులను తీసుకొచ్చేవారు. వారితోపాటు కుటుంబ సభ్యుల కోసం షెల్టర్లు ఏర్పాటు చేసి అన్ని వసతులు సమకూర్చేవారు.

పరిస్థితి తలకిందులు..

ఒకప్పుడు ఎంతో మందికి ఉపాధి కల్పించిన గ్రానైట్ పరిశ్రమ పరిస్థితి నేడు తలకిందులుగా మారింది. గతంలో తాడిపత్రి ప్రాంతంలో 650 వరకు గ్రానైట్ పాలిషింగ్ యూనిట్లు ఉండగా నేడు వాటిలో సగం కూడా పనిచేయడం లేదు. ఇతర రాష్ట్రాల కార్మికులు స్వస్థలాలకు వెళ్లిపోయారు. ఉన్న కొద్దిమంది కార్మికులకు యూనిట్ల నిర్వాహకులు జీతాలు తగ్గించేశారు. అయినా, వేరే దారి లేక ఇక్కడే నెట్టుకొస్తున్నారు.

గుజరాత్ టైల్స్ దెబ్బ..

గ్రానైట్ యూనిట్లకు గుజరాత్ టైల్స్ దెబ్బపడింది. గ్రానైట్‌తో పోలిస్తే తక్కువ ధరకు దొరుకుతుండడంతో ప్రజలు టైల్స్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. టైల్స్‌లో వందల రకాలు అందుబాటులో ఉండడంతో అటు వైపు మొగ్గు చూపుతున్నారు. గ్రానైట్ బండల రవాణా ఖర్చు కూడా అధికంగా ఉంటోంది. అడుగు గ్రానైట్ తరలింపునకు రవాణా ఖర్చు రూ. 15 అయితే, గుజరాత్ టైల్స్ రవాణాలో అడుగుకు కేవలం రూ.5 వరకూ ఖర్చవుతోంది. గ్రానైట్ బరువు కూడా ఎక్కువే. గుజరాత్ టైల్స్ అడుగు బరువు కిలో వరకు ఉండగా గ్రానైట్ బరువు అడుగు రెండు నుంచి మూడు కిలోలు ఉంటుంది. అన్ని రకాలుగా సౌలభ్యంగా ఉండడంతో వ్యాపారులు కూడా గ్రానైట్ బండలు కొనడం మానేసి, టైల్స్ విక్రయాలు చేయడం ప్రారంభించారు. ఇక.. తాడిపత్రి పరిసర ప్రాంతాల్లో నాణ్యత కలిగిన గ్రానైట్ గనులు లేవు. 300 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న కనిగిరి తదితర ప్రాంతాల్లో ఉన్న గనుల నుంచి ముడిసరుకు రవాణ చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో సరుకు రవాణా వ్యయం పెరగడం, యూనిట్లలో వాటిని కట్ చేసి పాలిష్ చేయడానికి ఖర్చు తడిసి మోపెడవుతోంది. ఇలా గ్రానైట్ యూనిట్లు కుదేలవుతున్నాయి. వాటినే నమ్ముకున్న కార్మికులకు ఆవేదన మిగులుస్తున్నాయి.

తగినంత ఉపాధి లేదు



బిహార్ నుంచి తాడిపత్రికి వచ్చా. ఇక్కడ ఉపాధి ఎక్కువగా ఉంటుందని, డబ్బు కూడా ఎక్కువగా వస్తుందని చెప్పడంతో మా వారితో కలిసి చేరుకున్నా. మొదట్లో బాగానే పని ఉండేది. రాత్రి సమయాల్లో కూడా బండలు చేసేవాణ్ణి. చేతి నిండా డబ్బు వచ్చేది. ఏమైందో తెలియదు, నేడు చాలా వరకూ పని తగ్గిపోయింది. మా సమీపంలోని గ్రానైట్ యూనిట్ మూసి వేయడంతో అక్కడున్న వారు ఉపాధి కోసం మరోచోటుకు వెళ్లారు. – బెంజ్‌నాథ్, కార్మికుడు

ఇంత డబ్బు మా రాష్ట్రంలో రాదు..



ఎంతో ఆశతో సొంత రాష్ట్రం వదిలిపెట్టి ఉపాధి కోసం తాడిపత్రికి వచ్చా. మా ఆశలు నేడు అడియాసలవుతున్నాయి. కొన్ని రోజులుగా గ్రానైట్ యూనిట్లలో పనులు సక్రమంగా జరగడం లేదు. ఇక్కడ పనులు దొరక్కపోతే ఒట్టి చేతులతో కుటుంబంతో సహా తిరిగి బిహార్‌కు పోవాల్సిందే. అక్కడికి పోయి మరో పని చేసి ఉపాధి పొందాలి. ఇక్కడ కూలి రూపంలో వస్తున్న డబ్బు మా రాష్ట్రంలో ఏ పనిచేసినా రాదు. – సుభోర్, కార్మికుడు, బిహార్

కోలుకునే అవకాశం లేదనిపిస్తోంది



ఇప్పటికే నష్టాల్లో ఉన్న గ్రానైట్ యూనిట్లను గుజరాత్ టైల్స్ తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ఎక్కువ మంది టైల్స్ కొనుగోలు చేయడానికే ఇష్టపడుతున్నారు. తక్కువ ధరకు దొరుకుతుండటంతో ఆసక్తి చూపుతున్నారు. భవిష్యత్తులోనూ గ్రానైట్ యూనిట్లు నష్టాల నుంచి కోలుకునే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో కొందరు లీజుకు ఇస్తుండగా, మరికొందరు మూసివేస్తున్నారు.

– సుదర్శన్, తాడిపత్రి గ్రానైట్ పరిశ్రమల నిర్వాహకుల యూనియన్ మాజీ అధ్యక్షుడు

నేటి నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

అనంతపురం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఆదివారం డిపార్ట్‌మెంటల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఆగస్టు 2 వరకూ సాగనున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణపై డీఆర్ఓ రామకృష్ణా రెడ్డి శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా నాలుగు కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఆబ్జెక్టివ్ విధానంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. వ్యాసరూప విధానంలో పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు. పరీక్ష సమయానికి అరగంట ముందే కేంద్రం ద్వారాలు మూసివేస్తారని, అభ్యర్థులు పరీక్ష సమయం కంటే గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఈ–అడ్మిట్ కార్డుతో పాటు ఏదేని గుర్తింపు కార్డు చూపించాలన్నారు. కేంద్రంలోకి ఎలాంటి మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరని చెప్పారు. అభ్యర్థులు దుష్ప్రవర్తన కనబరిచినా, కమిషన్ సూచనలు అనుసరించకపోయినా చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేస్తారన్నారు. సమావేశంలో ఏపీపీఎస్సీ అధికారులు వెంకటరమణ, యోగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

'అగ్నివీర్' పోస్టులకు దరఖాస్తులు

అనంతపురం కార్పొరేషన్: 'అగ్నివీర్' పథకంలో భాగంగా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి ఏ కళ్యాణి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. 50 శాతం మార్కులతో మేథమాటిక్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లతో ఇంటర్, మూడేళ్ల ఇంజినీరింగ్ డిప్లమా, తత్సమాన విద్యార్హతలు కలిగి ఉండాలన్నారు. https: agnipathvayu.cdac.in ఈ నెల 28లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లోనే రాత పరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్, మెడికల్ ఫిట్‌నెస్ పరీక్షలతో పాటు ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు.

ఆగస్టు రెండో వారంలో ఐఏబీ సమావేశం

- కలెక్టర్ వినోద్‌కుమార్

కణేకల్లు: సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం ఆగస్టు రెండో వారంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. కణేకల్లు చెరువును శనివారం హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్, ఈఈ వెంకటరమణరెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. చెరువు నీటి నిల్వ సామర్థ్యం ఎంత? ఆంధ్రా సరిహద్దు వద్ద ఎన్ని క్యూసెక్కుల నీరు వస్తోంది? టీబీ డ్యాం నుంచి కణేకల్లు వరకు హెచ్చెల్సీ కాలువ ఎన్ని కిలోమీటర్ల పొడవు ఉందనే విషయాలపై ఆరా తీశారు. అనంతరం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఐఏబీ సమావేశంలో సాగు, తాగునీటిపై చర్చించి ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తామన్నారు. తుంగభద్ర జలాలు శనివారం పీఏబీఆర్‌కు చేరాయన్నారు. తాగునీటి అవసరాల కోసం ప్రస్తుతం వస్తున్న నీటిని పీఏబీఆర్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది హెచ్చెల్సీకి కేటాయించిన 26 టీఎంసీల నీటిని పూర్తిస్థాయిలో తీసుకునే అవకాశముందన్నారు. హెచ్చెల్సీ ఆయకట్టుకు సక్రమంగా సాగునీరిచ్చి రైతులను ఆదుకుంటామన్నారు. హెచ్చెల్సీ కింద 1.4 లక్షల ఎకరాలతోపాటు వీలైతే కర్నూలు జిల్లాలో ఉన్న 20 వేల ఎకరాలకు సాగునీరందిస్తామన్నారు. కార్యక్రమంలో కణేకల్లు హెచ్చెల్సీ సబ్ డివిజన్ డీఈఈ మద్దిలేటి, ఏఈఈ అల్తాఫ్ పాల్గొన్నారు.



కణేకల్లు చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్


ఇసుకను కర్ణాటకకు తరలిస్తే క్రిమినల్ చర్యలు

రాయదుర్గం: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచామని, కర్ణాటక తరలిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. శనివారం రాయదుర్గం మండలంలోని జుంజురంపల్లి ఇసుక రీచ్‌ను ఆయన పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జుంజురంపల్లి స్టాక్‌యార్డు నుంచి ఇప్పటి వరకూ 16,226 మెట్రిక్ టన్నులు తరలించగా, 41,934 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు. రూ.195కే టన్ను ఇసుక అందిస్తున్నామన్నారు. పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారుల నిఘా సాగుతోందన్నారు. రీచ్ వద్ద కాకుండా ఎక్కడ పడితే అక్కడ తవ్వకాలు చేపట్టరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుక సరాఫరాలో ఇబ్బందులు తలెత్తితే మైన్స్ అండ్ జియాలజీ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఇళ్ల నిర్మాణాలకు కొరత లేకుండా ఇసుక అందుతోందన్నారు. జుంజురంపల్లి రీచ్ నుంచి కర్నూలు జిల్లా పత్తికొండ, శ్రీ సత్యసాయి జిల్లా అమరాపురానికి కూడా ఇసుక తీసుకెళ్తున్నారని చెప్పారు. జిల్లాలో స్టాక్ యార్డులు, కొత్తగా ప్రతిపాదనలు పంపిన రీచ్‌లలో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు.లోడింగ్,రవాణాలో వ్యత్యాసం రాకుండా చూడాలని స్థానిక అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక రైతు సేవా కేంద్రంలో మొక్కలు నాటారు.

- శనివారం రాత్రి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డును కలెక్టర్ తనిఖీ చేశారు. పన్ను వసూళ్లలో పారదర్శకత పాటించాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో మైనింగ్ ఏడీ నాగయ్య, మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ తహసీల్దార్ చిట్టిబాబు, సీ శ్రీనివాసులు, వ్యవసాయాధికారులు మహేంద్ర, నిర్మల్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

టీబీ డ్యాంకు కొనసాగుతున్న వరద

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి వరద నీటి చేరిక కొనసాగుతోంది. ఈ క్రమంలో మొత్తం 33 క్రస్ట్ గేట్లు (25 గేట్లు మూడున్నర అడుగులు, 8 గేట్లు ఒక్క అడుగు మేర) ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. 1,41,485 క్యూసెక్కుల నీటిని తుంగభద్ర నదికి, 8,895 క్యూసెక్కులను కాలువలకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యాంకు ఇన్‌ఫ్లో 1,10,943 క్యూసెక్కులుండగా, అవుట్ ఫ్లో 1,50,500 క్యూసెక్కులు ఉంది. జలాశయంలో 105.788 టీఎంసీల పూర్తి నీటి నిల్వ సామర్థ్యానికి గానూ 100 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1,633 అడుగుల నీటి మట్టానికి గాను 1,631.56 అడుగులకు నీరు చేరింది.



తుంగభద్ర డ్యాం నుంచి విడుదలవుతున్న నీరు

కడుపులో ఐదు కిలోల గడ్డ

- వృద్ధురాలికి శస్త్రచికిత్స చేసి తొలగించిన సర్వజనాస్పత్రి వైద్యులు

అనంతపురం మెడికల్: ఆమెకు తరచూ కడుపు నొప్పి వస్తుండేది. ఎన్ని ఆస్పత్రులకు వెళ్లి చూపించుకున్నా తగ్గలేదు. చివరకు సర్వజనాస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటే కడుపులో గడ్డ ఉందని తెలిపారు. సర్జరీ విభాగం వైద్యులు మూడు గంటలు శ్రమించి ఆపరేషన్‌ను విజయవంతంగా చేసి గడ్డను బయటకు తీశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రామస్వామి నాయక్ శనివారం 'సాక్షి'కి తెలిపారు. గుమ్మఘట్ట మండలం రంగచేడు గ్రామానికి చెందిన రంగప్ప భార్య నరసమ్మ ఐదేళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. గత నెల 29న ప్రొఫెసర్ డాక్టర్ రామస్వామి నాయక్ ఆదేశాలతో 6వ యూనిట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమణ నాయక్.. నరసమ్మను అడ్మిషన్ చేసి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఆమె కడుపులో 50 – 80 గ్రాముల్లోపు ఉండాల్సిన ప్లీహం ఐదు కిలోలు ఉండటంతో వైద్యులు ఆశ్చర్యపోయారు. 'మాసివ్ స్ప్లీన్ మెగాలీ' సమస్యగా గుర్తించి ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు.

సర్జరీ విజయవంతం

ఈ నెల 9న ప్రొఫెసర్ డాక్టర్ రామస్వామి నాయక్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉజ్వనేశ్వరి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమణనాయక్‌తో కూడిన బృందం వృద్ధురాలు నరసక్కకు మూడుగంటల పాటు శ్రమించి శస్త్రచికిత్సను విజయవంతం చేసింది. వాస్తవంగా శరీరంలో 60 శాతం రక్తం ప్లీహం నుంచే ఉత్పత్తి అవుతుంది. గడ్డను తొలగించే సమయంలో రక్తం అవసరం చాలా ఉంటుందని వైద్యులు భావించారు. రక్తాన్ని ఉత్పత్తి చేసే ప్లేట్‌లెట్స్‌ను శస్త్రచికిత్స చేసే ముందు ఐదు ప్యాకెట్లు ఎక్కించారు. సర్జరీ పూర్తి చేసిన తర్వాత 16 ప్యాకెట్ల ప్లేట్‌లెట్స్ ఎక్కించారు. కోలుకున్న వృద్ధురాలు నరసక్కను ప్రొఫెసర్ డాక్టర్ రామస్వామి నాయక్ బృందం శనివారం డిశ్చార్జ్ చేసింది. ఈ సందర్భంగా డాక్టర్ రామస్వామి నాయక్, డాక్టర్ ఉజ్జునేశ్వరి, డాక్టర్ రమణానాయక్, మత్తుమందు వైద్యులు డాక్టర్ హరికృష్ణ, పీజీ వైద్యులు డాక్టర్ రమ్య, డాక్టర్ విశాల్, డాక్టర్ అభిలాష్, స్టాఫ్‌నర్సు సునీత, ఓటీ అసిస్టెంట్లను అభినందించారు.



నరసక్కతో డాక్టర్ రామస్వామి నాయక్ బృందం



నరసక్క కడుపులో నుంచి తొలగించిన గడ్డ

రిజిస్ట్రార్ నియామకం.. వివాదాస్పదం

- మంత్రి లోకేష్‌కు ప్రొఫెసర్ల ఫిర్యాదు
- అర్హత లేకున్నా సామాజికవర్గం ప్రాతిపదికన అందలమెక్కించారని ఆరోపణ
- వివరణ ఇవ్వాలని ఎస్కేయూ ఉన్నతాధికారులకు ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ నియామకం వివాదాస్పదమవుతోంది. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వానికి పలువురు ప్రొఫెసర్లు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ వివరణ కోరడం సంచలనంగా మారింది. వివరాలు.. ఎస్కేయూ రిజిస్ట్రార్‌గా ఇటీవల రమేష్ బాబు నియమితులయ్యారు. వాస్తవానికి రిజిస్ట్రార్ పదవికి తొలి ప్రాధాన్యతగా ప్రొఫెసర్లను ఎంపిక చేయాలి. ప్రొఫెసర్లలో నిష్ణాతులు లేకపోతే డిప్యూటీ రిజిస్ట్రార్ స్థాయి వారికి అప్పగించవచ్చు. కానీ, రీసెర్చ్ కమ్ స్టాటిస్టికల్ అధికారిగా ఉన్న రమేష్ బాబును రిజిస్ట్రార్‌గా ఎంపిక చేశారు.

సీనియర్ ప్రొఫెసర్లను తోసిరాజని..

ఎస్కేయూలో సీనియర్ ప్రొఫెసర్లు అనేక మంది ఉన్నారు. రిజిస్ట్రార్ పదవికి వీరిలో కొందరు అర్హులైనా ఎంపిక చేయలేదు. దీంతోనే ప్రొఫెసర్లు మంత్రికి ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా రెక్టార్ నియామకంలో కూడా నిబంధనలు ఉల్లంఘించారని, సీనియార్టీలో ఏకంగా 16వ స్థానంలో ఉన్న వ్యక్తికి రెక్టార్ పదవి కట్టబెట్టారని, రిజిస్ట్రార్, రెక్టార్ల నియామకాల్లో సామాజిక న్యాయం పాటించలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ స్పందించి దీనిపై వివరణ ఇవ్వాలని వర్సిటీ ఉన్నతాధికారులను ఆదేశించారు. 'సామాజిక న్యాయం పాటించాలని అన్ని వర్సిటీలను కోరాం. ఎందుకు పాటించలేదు' అని ప్రశ్నించినట్లు సమాచారం. అయితే, రీసెర్చ్ కమ్ స్టాటిస్టికల్ ఆఫీసర్ అయిన రమేష్ బాబుకు డిప్యూటీ రిజిస్ట్రార్ పేస్కేల్ కంటే ఎక్కువ జీతం వస్తోందని, అందుకే రిజిస్ట్రార్‌గా ఎంపిక చేశామని ఉన్నతాధికారులు వివరణ ఇచ్చినట్లు తెలిసింది. ఏదిఏమైనా, వచ్చే పాలకమండలి సమావేశంలోనే రెక్టార్, రిజిస్ట్రార్ పదవులకు ఎంపిక చేసిన వారిపై నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సందర్భంగా రెక్టార్, రిజిస్ట్రార్‌లలో ఎవరో ఒకరిని రాజీనామా చేయాలని కోరతారని, ఈ క్రమంలో ఎవరు రాజీనామా చేస్తారు అనే అంశంపై వర్సిటీలో జోరుగా చర్చ జరుగుతోంది. బీసీ కేటగిరీ వారికి వీసీ, రెక్టార్ పదవిని ఓసీ వారికి కేటాయించినపుడు, రిజిస్ట్రార్ పదవిని ఎస్సీ, ఎస్టీ ప్రొఫెసర్లకు ఇచ్చి ఉంటే సామాజిక న్యాయం పాటించినట్లు అయి ఉండేదని సీనియర్ ప్రొఫెసర్లు బాహాటంగానే వ్యాఖ్యానిస్తున్నారు.



క్లుప్తంగా

అర్హులకు కౌలుదారు కార్డులు



కౌలుదారుల అవగాహన సదస్సులో పాల్గొన్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అగ్రికల్చర్: అర్హత కలిగిన కౌలుదారులకు క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డ్స్ (సీసీఆర్‌సీ) అందజేస్తామని వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. శనివారం అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి, కాటిగానికాలువ రైతు సేవా కేంద్రాల్లో కౌలురైతుల గుర్తింపు కోసం అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి జె.శశికళ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జేడీఏ ముఖ్య అతిథిగా హాజరై కౌలు రైతుల చట్టం, ప్రయోజనాల గురించి తెలియజేశారు. స్వంత భూమిదారులకు నష్టం వాటిల్లకుండా కౌలుదారులకు కూడా సీసీఆర్‌సీలు ఇచ్చి ప్రభుత్వ ప్రయోజనాలు కల్పిస్తామన్నారు. పరస్పర అంగీకారంతో అటు స్వంత భూమిదారులు ఇటు కౌలుదారులకు వ్యవసాయం లాభసాటి అవుతుందని తెలిపారు. ఎంత మంది ముందుకు వచ్చినా గుర్తింపు కార్డులు అందజేస్తామన్నారు. సమావేశంలో ఏఈఓలు మురళీకృష్ణ, అలేఖ్య, వీహెచ్‌ఏ కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో చిన్నారి స్కందన్‌కు చోటు



చిన్నారి స్కందన్ కార్తికేయను అభినందిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ఫ్లాష్ కార్డులను గుర్తించడంలో చిన్నారి స్కందన్ కార్తికేయ నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించుకోవడం జిల్లాకు గర్వకారణమని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. గుమ్మఘట్ట మండలం గోనబావి గ్రామానికి చెందిన సచివాలయ ఉద్యోగి శాంతి కుమారుడు నందన్ కార్తికేయ (వయసు 4 నెలలా 19 రోజులు) 244 ఫ్లాష్ కార్డులను (కూరగాయలు, రంగులు, జంతువులు, పండ్లు, పక్షులు, వాహనాలు, స్వాతంత్ర్య సమరయోధులు, తదితర) గుర్తించడంలో అతి చిన్న వయస్కునిగా నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో పేరు నమోదైంది. కలెక్టర్‌ను శాంతి, హేమంత్‌కుమార్ దంపతులు తమ కుమారుడు కార్తికేయతో కలిసి శనివారం కలెక్టరేట్‌లో కలిశారు. ఈ సందర్భంగా చిన్నారిని కలెక్టర్ అభినందించారు. భవిష్యత్తులోనూ చిన్నారికి మంచి ప్రోత్సాహం ఇవ్వాలని చెప్పారు.

సాహితీ పరిమళం అనంతం

- స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న ఉమ్మడి జిల్లా కవులు, రచయితలు
- పలు పుస్తకాల్లో పాఠ్యాంశాలుగా వీరి రచనలు

"ఏ తపస్వి జీవించెనో యీ మనోజ్ఞ సీమ, పూజ్యమౌ అనంత సీమలోన నాటి రుషి వాటికల శోభనందపరచు ప్రకృతి మాధుర్య మొలుకు పల్లెలిచట.."

అని మధుర కవి బెళ్లూరు శ్రీనివాసమూర్తి కీర్తించినట్లు ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎందరో సాహితీవేత్తలు, కవులు, రచయితలు సాహితీ సుగంధాలను విశ్వవ్యాప్తం చేశారు. అనంత వాసుల గ్రంథాలను ఎన్నో విశ్వవిద్యాలయాలు పాఠ్యాంశాలుగా చేర్చాయి. కాలానుగుణంగా రూపం మారినట్లే వస్తువూ మారుతూ వస్తోంది. ఒకనాటి ఆధ్యాత్మిక బాటను వీడి వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ప్రభావం సాహితీకారులపై, విమర్శకులపై బలంగా ఉండడంతో జిల్లా కవులు, రచయితలు తెలుగు సాహితీ యవనికపై తమ కవనంతో ప్రజ్వలిస్తూ జిల్లాకు మరింత ఖ్యాతిని తెస్తున్నారు. 'అనంత'నే కార్యక్షేత్రంగా మార్చుకున్న రాచపాళెం వంటి సాహితీ దిగ్గజాలు జాతీయ వేదికలపై జిల్లా కీర్తిని ఇనుమడింపజేస్తూ సీమ సాహితీ, చారిత్రక అంశాలు పాఠ్యాంశాలుగా మారడానికి కృషి చేస్తున్నారు. వారిలో కొందరు అమరులైనా తెలుగువారి హృదయాలలో చిరస్థాయి ముద్రవేశారు. ఈ క్రమంలోనే గత ప్రభుత్వం వారి కృషిని ప్రత్యేకంగా గుర్తించి వారి రచనలను పాఠ్యాంశాలుగా చేర్చింది.

– అనంతపురం కల్చరల్:

బాలలు మెచ్చే కవి కోగిర



కోగిర జైసీతారామ్

బాలల సాహితీ లోకానికి మధుర గేయాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చిన కవికాకి కోగిర జైసీతారామ్ రచించిన 'ఇల్లు–ఈగ' గేయం 1వ తరగతిలో, 'మ్యావ్ మ్యావ్' గేయం 2వ తరగతిలో పాఠ్యాంశంగా చేర్చారు. మహాకవి శ్రీశ్రీనే మెప్పించిన కోగిర జైసీతారామ్ రొద్దం మండలం కోగిర గ్రామానికి చెందిన వారు. సాహిత్యంతో పాటూ కళాకారుడు, గొప్ప చిత్రకారుడు కూడా కావడం విశేషం.


సీమ ఆత్మకు ప్రతిరూపం



విద్వాన్ విశ్వం

నిఖార్సైన సీమ కవిత్వానికి ప్రతిరూపంగా నిలిచిన విద్వాన్ విశ్వం అసలు పేరు విశ్వరూపాచారి. శింగనమల నియోజకవర్గం తరిమెల గ్రామానికి చెందిన వారు. కవిగా, రచయితగా, పత్రికా సంపాదకుడిగా, రాజకీయవేత్తగా చిరపరిచితులైన విద్వాన్ విశ్వం కలం నుంచి జాలువారిన ప్రసిద్ధ గేయం 'పెన్నేటి పాట' కవితను 5వ తరగతిలో పాఠ్యాంశంగా పెట్టారు. 'ఎందుకెండిపోయెనో నా పెన్నా' అంటూ అందరినీ ఆలోచింపజేసిన కవిత్వంతో ఎంతో ప్రసిద్ధులయ్యారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి రాళ్లపల్లి



రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ

సంగీత సాహిత్యాలలో ప్రసిద్ధులైన రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ కంబదూరు మండలం రాళ్లపల్లిలో జన్మించారు. 'సారస్వతాలోకము' అన్నమాచార్యులు కృతుల స్వరకల్పన, వేమనపై విమర్శనా గ్రంథం వంటి రచనలు చేశారు. ఆయన రాసిన శ్రీ శాలివాహన గాథా సప్తశతిసారం' చదవడం ద్వారా విద్యార్థులు సత్ప్రవర్తన అలవరచుకుంటారన్న ఉద్దేశంతో 7వ తరగతి విద్యార్థులకు 'నైతిక విలువలు' పేరిట పాఠంగా పెట్టారు.

అనంత సాహితీ సింగం




సింగమనేని నారాయణ

అనంత తొలి కథకుడిగా పేరొందిన సుప్రసిద్ధ కథా రచయిత సింగమనేని నారాయణ బండమీదపల్లి గ్రామంలో జన్మించారు. సీమ కథలు, జూదం, అనంతం, సింగమనేని కథలు పేర్లతో అనేక సంపుటాలను వెలువరించారు. ప్రభుత్వం నుంచి కళారత్న అవార్డునందుకున్న సింగమనేని నారాయణ రచించిన 'అనంతం' కథల సంపుటిలోని కథ పయనం పాఠాన్ని ప్రస్తుతం 8వ తరగతి విద్యార్థులు చదువుతున్నారు.



రాచపాళెం చంద్రశేఖరరెడ్డి కవిత 9వ తరగతి వాచకంలో

రాచపాళెం కృషి స్ఫూర్తిదాయకం



విశిష్ట రచనా శైలితో తెలుగు సాహిత్యానికే వన్నె తెచ్చిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాచపాళెం చంద్రశేఖరరెడ్డిది అనంత సాహిత్యంలో ప్రత్యేకమైన స్థానం. అనేక సందర్భాలలో పాఠ్యప్రణాళిక సభ్యుడిగా సంపాదక మండళ్లలో వివిధ హోదాలలో పనిచేసిన ఆయన రాయలసీమ సాహిత్యం పాఠ్యాంశాలుగా రావడానికి కృషి చేయడమే కాదు దాదాపు పోరాటమే చేశారు. 1985లోనే ఆయన డిగ్రీ తెలుగు వాచకం తయారీ సంఘ సభ్యుడిగా పాతతరం సాహిత్యంతో పాటూ ఆధునిక సాహిత్యం విరివిగా వచ్చేలా స్వయంగా వ్యాసాలు రాశారు. 1996లో తెలుగు శాఖలో పాఠ్య ప్రణాళిక అధ్యక్షుడిగా ఎం.ఏ తెలుగులో రాయలసీమ సాహిత్యం పాఠ్యాంశంగా వచ్చేలా చేశారు. 2005–2007 మధ్య అధికార భాషా సంఘం అధ్యక్షునిగా పనిచేసిన ఆయన సంస్కృతాన్ని గౌరవిస్తూనే తెలుగు నిర్బంధంగా బోధించాలని ఎంతో మందిని ఒప్పించారు. 2012లో 6, 7, 8, 9 తరగతుల వాచకాలలో సీమకు ప్రాతినిధ్యం కోసం పెద్దలను ఒప్పించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రభుత్వ పెద్దలు ఆయన సలహా మేరకు వేమన, పోతులూరి వీరబ్రహ్మం పద్యాలను ప్రధానంగా చేర్పించారు. ప్రధాన సంపాదకుడిగా రాయలసీమ పాఠాలకు పెద్ద దిక్కుగా వ్యవహరించారు. ప్రస్తుత 9వ తరగతి విద్యార్థులు ఆయన రాసిన 'మా నాయన' కవితను చదువుతున్నారు.

విభిన్న వ్యక్తిత్వం చిలుకూరి సొంతం



చిలుకూరి దేవపుత్ర

విభిన్నమైన, నిరాడంబరమైన జీవన విధానంతో గొప్ప రచయితగా కీర్తికెక్కిన చిలుకూరి దేవపుత్ర కాల్వపల్లెలో జన్మించారు. ఆయన రచించిన 'మమకారం' పాఠం ప్రస్తుతం 6వ తరగతి తెలుగువాచకంలో ఉంది. వంకరటింక, ఆరుగ్లాసులు వంటి కథా సంపుటాలతో పాటూ ప్రసిద్ధి చెందిన 'పంచమం' వంటి నవలలను తెలుగుజాతికి అందించారు. గుర్రం జాషువా, చాసో పురస్కారాలనందుకున్న ఆయన వ్యక్తిత్వంతోనే అనంత అభిమానుల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచిపోయారు.

అవధాన సార్వభౌముడు ఆశావాది



ఆశావాది ప్రకాశరావు

అత్యంత కష్టతరమైన అవధాన విద్యను మరింత సులభతరం చేసి తెలుగు సాహిత్యంలోనే విశేష గుర్తింపు పొందిన ఆశావాది ప్రకాశరావు శింగనమల మండలం కొరివిపల్లెలో జన్మించారు. 171 అవధానాలను వివిధ ప్రాంతాలలో నిర్వహించిన ఆయన 2021లో 'పద్మశ్రీ' అందుకున్నారు. అవధాన ప్రక్రియలోని అనేక మెలకువలను ముఖాముఖిగా 9వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చారు.

అనంత సాహితీ పరిశోధకుడు



ఆచార్య గంగప్ప

ఆచార్య ఎస్.గంగప్పగా పేరొందిన శ్రీరామప్పగారి గంగప్ప పెనుకొండ తాలూకా నల్లగొండ్రాయనిపల్లెలో 1936లో జన్మించారు. సాహిత్య సుధ, సాహిత్యానుశీలన, క్షేత్రయ్య పద సాహిత్యం, జాతికి ప్రతిబింబం జానపద సాహిత్యం వంటి రచనలు చేశారు. ఈయన కలం నుంచి జాలువారిన సాహిత్యానుశీలన గ్రంథం నుండి 'సూక్తి సుధ' పేరుతో 10వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చి కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు నందుకున్న సాహితీ దిగ్గజానికి మరింత గౌరవం తెచ్చారు.

న్యాయమైన పరిహారం ఇప్పించండి

- పొల్యూషన్ అధికారులను కోరిన రైతులు



పరిహారం గురించి అధికారితో మాట్లాడుతున్న రైతులు, సీపీఐ నాయకులు

బొమ్మనహాళ్: నేమకల్లు శివారులోని స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీల ద్వారా వచ్చే కాలుష్యంతో పంట పొలాలు దెబ్బతింటున్నాయని, ఫ్యాక్టరీ యజమానుల ద్వారా తమకు న్యాయమైన పరిహారం ఇప్పించాలని రైతులు కోరారు. ఇదే అంశంపై సీపీఐ, రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా పోరాటాలు చేస్తున్నారు. శనివారం సాయంత్రం అనంతపురం కాలుష్య నియంత్రణ మండలి అధికారి (పొల్యూషన్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్) కిషోర్‌రెడ్డి, ఎనలిస్ట్ మహేష్‌లు ఫ్యాక్టరీల సమీపంలోని పంట పొలాలను పరిశీలించేందుకు వచ్చారు. విషయం తెలుసుకున్న రైతులు తమకు న్యాయం చేయాలని అధికారుల ఎదుట ఆందోళనకు దిగారు. రాయదుర్గం రూరల్ సీఐ ప్రసాద్‌బాబు, డి.హీరేహాళ్ ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి రైతులకు సర్ది చెప్పారు. అనంతరం రైతులు వసిగేరప్ప, బసన్న, రామాంజినేయులు, హనుమంత, హనుమంత్‌రెడ్డిలకు చెందిన అలసంద, మిరప, అనుపకాయ పంటలను అధికారులు పరిశీలించారు. స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీల నుంచి వెలువడిన దుమ్ము, కాలుష్యం పంటలపై పడి ఉండటాన్ని చూశారు. అనంతరం కాలుష్య నియంత్రణ మండలి అధికారి కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల ఫిర్యాదు మేరకు పంటలపై కాలుష్యాన్ని పరిశీలించేందుకు వచ్చామన్నారు. కాలుష్యం నివేదిక, రైతుల అభిప్రాయాలను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. వారం పది రోజుల్లో ఎంత మేర పొల్యూషన్ వస్తోందో యంత్రాల ద్వారా పరిశీలిస్తామన్నారు. రైతులకు న్యాయం జరగకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని సీపీఐ నాయకుడు నాగార్జున హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

శింగనమల: నార్పల మండలం కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పులసనూతల గ్రామానికి చెందిన బెస్త రాజ్‌కుమార్(30) శనివారం నార్పలలోని శ్రీనివాస థియేటర్ పక్కన పెట్రోలు బంక్‌లో బైక్‌కు పెట్రోలు పోయించుకుని వస్తుండగా పుట్లూరు మండలం రంగినేపల్లి వైపు వెళ్తున్న ఆటో అతివేగంగా వచ్చి ఢీకొంది. తీవ్రంగా గాయపడిన రాజ్‌కుమార్‌ను అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో రాజ్‌కుమార్ మృతి చెందాడు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నార్పల పోలీసులు కేసు నమోదు చేశారు.

వైద్య సేవలు విస్తృతం చేయాలి

అనంతపురం మెడికల్: పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలను వినియోగించుకునేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి ఆదేశించారు. శనివారం నగరంలోని వినాయకనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ పరిశీలించారు. ఓపీ సేవలు పెంచాలని సూచించారు. ఇక్కడ చేసే వైద్య పరీక్షలు, అందించే మందులు తదితర వాటి గురించి ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం ప్రాథమిక కేంద్రం పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆవరణలో మొక్కలు పెంచాలన్నారు. డీఎంహెచ్‌ఓ వెంట డాక్టర్ సుస్మిత ఉన్నారు.

'అనంత' యువకులకు జాతీయ అవార్డులు





కేంద్రమంత్రి చేతుల మీదుగా అవార్డునందుకుంటున్న భరత్, జీవన్‌కుమార్

అనంతపురం కల్చరల్: టెక్నాలజీ రంగంలో స్వచ్ఛందంగా అత్యున్నత సేవలందిస్తున్న అనంతపురం యువకులు బిసాతి భరత్, జీవన్‌కుమార్‌కు జాతీయ అవార్డులు వరించాయి. ఢిల్లీలోని ఇండియా హాబిటెడ్ సెంటర్ వేదికగా జరిగిన కార్యక్రమంలో కేంద్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ సహాయమంత్రి జితిన్ ప్రసాద్ చేతుల మీదుగా భరత్ 'మై గావ్ అంబాసిడర్' అవార్డు, జీవన్‌కుమార్ 'మై గావ్ సాథి' అవార్డును అందుకున్నారు. మై గవర్నమెంట్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం స్థాపించి పదేళ్లవుతున్న సందర్భంగా ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, ప్రధాన మంత్రి బీమా యోజన, క్యాష్‌లెస్ ఇండియా, డిజీ లాకర్, ఉమాంగ్ యాప్ ఆత్మనిర్భర్ భారత్, ఆజాదీ కా అమృత మహోత్సవ్ వంటి అనేక కేంద్ర ప్రభుత్వ పథకాలకు విస్తృత అవగాహన, చైతన్యం కల్పించడంలో అనంతపురం యువకులు చూపుతున్న చొరవ ఎనలేనిదని అధికారులన్నారు. దేశంలోనే కేవలం ఆరుగురికి మాత్రమే అవార్డులొస్తే.. అందులో ఇద్దరు జిల్లా యువకులు ఉండడంపై పలువురు అభినందనలు తెలియజేశారు.

టీటీ కోచ్‌పై చర్యలు

అనంతపురం: టేబుల్ టెన్నిస్ కోచ్ ధనుంజయరెడ్డిపై చర్యలు తీసుకున్నారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థలో అవుట్ సోర్సింగ్ కోచ్‌గా పనిచేస్తున్నారు. టేబుల్ టెన్నిస్ శిక్షణకు వచ్చే ఓ అమ్మాయి పట్ల అనుచితంగా ప్రవర్తించాడని నెల కిందట కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఐసీడీఎస్ అధికారులు విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక అందించారు. కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు టేబుల్ టెన్నిస్ కోచ్ ధనుంజయరెడ్డిని శాప్‌కు సరెండర్ చేసినట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి షఫీ పేర్కొన్నారు.

ఉజ్వల భవితకు నాలుగేళ్లు కీలకం

- బీటెక్‌లో చేరిన మొదటి రోజు నుంచే ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలి
- ఉన్నత విద్యామండలి మాజీ ఛైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఉన్నత విద్యామండలి మాజీ ఛైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి

అనంతపురం/ బుక్కరాయసముద్రం: ఉజ్వల భవిష్యత్తుకు బీటెక్ కోర్సులోని నాలుగు సంవత్సరాలే కీలకమని ఉన్నత విద్యామండలి మాజీ ఛైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి అన్నారు. ఎస్‌ఆర్‌ఐటీలో శనివారం ఆరంభ్– 2024 అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతనంగా అడ్మిషన్లు పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. మంచి ఇంజినీరింగ్ కళాశాలను ఎంపిక చేసుకోవడంతోనే బాధ్యత తీరిపోయింది అనుకోకుండా కోర్సులో అడ్మిషన్ పొందిన తొలి రోజు నుంచి ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సమయాన్ని వృథా చేసుకోకుండా, చదివే అలవాటు పెంపొందించుకోవాలన్నారు. క్రమశిక్షణతో మెలగాలన్నారు. తమలోని బలహీనతలు, భయాన్ని అధిగమించి ముందుకు సాగాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఎస్‌ఆర్‌ఐ సంస్థ సలహాదారు ఈఎస్ చక్రవర్తి (మాజీ టీసీఎస్ గ్లోబల్ హెడ్) మాట్లాడుతూ జీవితంలో ఏది కోల్పోయినా ..వ్యక్తిత్వాన్ని కోల్పోకుండా ఉంటే అదే మనల్ని ఉన్నతస్థానంలో నిలుపుతుందన్నారు. ఎస్‌ఆర్‌ఐటీ కరస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి మాట్లాడుతూ తమను నమ్మి ఈ కళాశాలలో చేర్పించిన తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బాలకృష్ణ, డీన్ డాక్టర్ సాయి చైతన్య కిషోర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యు.శ్రీనివాసులు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పోక్సో' నిందితుడి అరెస్ట్

గార్లదిన్నె: పోక్సో కేసులో నిందితుడైన నూర్‌బాషాను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చిన గార్లదిన్నెలోని క్రిస్టియన్ హాస్టల్‌ను అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి శనివారం తనిఖీ చేశారు. అక్కడి బాలికలతో వివరాలు సేకరించారు. లైంగిక వేధింపులకు గురైన బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడు నూర్‌బాషాపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసు, 75 బీఎన్‌ఎస్ యాక్టు కింద కేసు నమోదు చేశామన్నారు. ఈ మేరకు నిందితున్ని తలగాచిపల్లి క్రాస్ వద్ద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. డీఎస్పీ వెంట శింగనమల ఎస్‌ఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఏఈ ఆత్మహత్యాయత్నం

- అధికారుల వేధింపులే కారణమని భార్య ఫిర్యాదు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హౌసింగ్ ఏఈ బాలాజీ



బాలాజీ సతీమణి వనిత

ధర్మవరం అర్బన్/అనంతపురం మెడికల్: శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన హౌసింగ్ ఏఈ అన్నం బాలాజీ పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించారు. ధర్మవరం పట్టణంలోని హౌసింగ్ కార్యాలయంలో శనివారం తన వెంట తెచ్చుకున్న పురుగు మందు తాగడంతో తోటి ఉద్యోగులు గమనించి స్థానిక ప్రభుతాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఇక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. అధికారుల వేధింపుల వల్లే తన భర్త ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు బాలాజీ భార్య వనిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలాజీ సుమారు నాలుగేళ్ల పాటు ధర్మవరం హౌసింగ్ ఏఈగా పనిచేశారు. కొన్ని రోజుల క్రితం ఆయన్ను జిల్లా కేంద్రంలోని హౌసింగ్ పీడీ కార్యాలయానికి అటాచ్ చేశారు. అటూ ఇటూ తిరగలేనని, ధర్మవరంలోనే పోస్టింగ్ ఇవ్వాలని పట్టుబట్టినట్లు సమాచారం. పోస్టింగ్ విషయంలో జాప్యం జరగడంతో ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. కాగా.. రెండు నెలలుగా హౌసింగ్ పీడీ శంకర్‌నారాయణ, డీఈ శంకర్‌లాల్, ముగ్గురు కింది స్థాయి ఉద్యోగులు తన భర్తను వేధిస్తున్నారని, ముఖ్యంగా డీఈ శంకర్‌లాల్ భారీగా డబ్బు డిమాండ్ చేశారని బాలాజీ భార్య వనిత ఆరోపించారు. వారు అడిగిన మొత్తం ఇవ్వనందుకే ఎటువంటి కారణం చెప్పకుండానే పీడీ ఆఫీసుకు అటాచ్ చేశారన్నారు. రాప్తాడులో ఏఈగా ఉన్న ఓ వ్యక్తి కోసం తన భర్తను ఇబ్బందులకు గురి చేశారన్నారు. అధికారుల వేధింపులతో తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు చెప్పారు.

క్లుప్తంగా

ఆదర్శప్రాయుడు అబ్దుల్ కలాం



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆదర్శప్రాయుడని మేయర్ వసీం పేర్కొన్నారు. శనివారం నగర పాలక సంస్థలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మేయర్ మాట్లాడుతూ.. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ప్రసంగాలు యువతకు జీవిత పాఠాలు అని కొనియాడారు. ఒక శాస్త్రవేత్తగా భారతదేశానికి అందించిన సేవలు మరువలేనివన్నారు. కలలను సాకారం చేసుకోవాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, మునిసిపల్ ఆర్డీ పీవీవీఎస్ మూర్తి, అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, ఈఈలు సూర్యనారాయణ, సుధారాణి, డీఈలు శేఖర్, సుభాష్ చంద్రబోస్, కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, బాలాంజనేయులు, కమల్‌భూషణ్, అబూసలేహా, రహంతుల్లా, ఇసాక్, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, నాయకులు శీన, తదితరులు పాల్గొన్నారు.


విద్యారంగ సమస్యలపై జీపుజాతా

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి మూడు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా జీపుజాతా చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయి స్వామి మాట్లాడారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీపుజాతా అనంతపురంలో ప్రారంభమై నార్పల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఉరవకొండ, కణేకల్లు, రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఆత్మకూరు, రాప్తాడు వరకూ సాగుతుందన్నారు. సమస్యల పరిష్కారానికి అనంతపురం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి హనుమంతు, రాష్ట్ర సమితి సభ్యురాలు సాయి స్వరూప, జిల్లా ఉపాధ్యక్షులు నరసింహ, సహాయ కార్యదర్శి ఆంజనేయులు, నగర అధ్యక్ష కార్యదర్శులు మంజునాథ్ ఉమా మహేష్, నాయకులు రాధా, జ్యోతి, హర్ష, నాని, చైతన్య పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం 'సైబర్ సెక్యూరిటీ'పై అవగాహన సదస్సు కల్పించారు. కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొంటున్న కేటుగాళ్లు వివిధ రకాల మాయ మాటలతో బురిడీ కొట్టించి డబ్బులు కొల్లగొడుతున్నారన్నారు. లోన్ యాప్స్, ఆన్‌లైన్ వేధింపులు ఓటీపీ తదితర అంశాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ.. ఆన్‌లైన్ లావాదేవీలపై యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ సెక్యూరిటీ స్పెషలిస్ట్ మహేష్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండాలని సూచించారు. సదస్సులో కంప్యూటర్ విభాగం అధ్యాపకుడు జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

వీరశైవులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న వీరశైవ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు

అనంతపురం కల్చరల్: శ్రీశైలం దేవస్థానం పాలక మండలి చైర్మన్ పోస్టును వీరశైవులకు ఇవ్వాలని వీరశైవ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక వీరశైవ సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వందల ఏళ్లుగా శ్రీశైలం దేవస్థానంలో వీరశైవ సమాజానికి చెందిన వారే ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. ఇప్పుడు అదే సంప్రదాయాన్ని కొనసాగించాలన్నారు. అలాగే టీటీడీ బోర్డులో ఇంత వరకు వీరశైవులకు ప్రాధాన్యత లేదని కనీసం డైరెక్టర్‌గా అయినా ప్రాధాన్యం కల్పించాలని కోరారు. తిరుమల క్షేత్రపాలకుడు శివుడని.. ఆయన భక్తులకు ప్రాధాన్యత ఉండేలా వీరశైవులకు తగిన సౌకర్యాలు లేవని ఆవేదన చెందారు. కార్యక్రమంలో వీరశైవ సంఘం ప్రధాన కార్యదర్శి గౌని సతీష్‌కుమార్, జంగమ సమాజం అధ్యక్షుడు తిప్పేస్వామి పాల్గొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

అనంతపురం: కళ్యాణదుర్గం బైపాస్ రోడ్డులోని రాజా హోటల్ సమీపంలో శనివారం ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో అనంతపురం నగరానికి చెందిన ఇలియాజ్ అనే యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. అతడిని హుటాహుటిన సర్వజనాసుపత్రికి తరలించారు. మొహర్రం వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్తుండగా, రాంగ్ రూట్ వచ్చిన మరో బైక్ ఢీకొనడంతో సంఘటన చోటు చేసుకుంది. ప్రస్తుతం ఇలియాజ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

జిమ్‌కు మోక్షమెప్పుడో?



మూలన పడిన రూ.లక్షలు విలువ చేసే జిమ్ పరికరాలు



జిమ్ పైకప్పు దెబ్బతిన్న దృశ్యం

- ఏళ్ల తరబడి మూతపడిన నగరపాలక సంస్థ జిమ్
- గాలివానకు కూలిపోయిన పైకప్పు
- రూ.1.40 కోట్లతో జిమ్ ఏర్పాటుకు పాలకవర్గం నిర్ణయం
- టెండర్లు పిలవని నగరపాలక సంస్థ అధికారులు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని ఆదిమూర్తి నగర్‌లో ఉన్న నగరపాలక సంస్థ జిమ్‌కు నిర్లక్ష్యపు గ్రహణం పట్టింది. కోవిడ్ నుంచి జిమ్‌ను మూసేశారు. ఈ క్రమంలో గాలివానకు జిమ్ పాక్షికభాగం పూర్తిగా దెబ్బతినడంతో.. జిమ్ శిథిలావస్థకు చేరింది. ఈ క్రమంలో రూ.1.40 కోట్లతో అధునాత జిమ్‌ను ఏర్పాటు చేయాలని పాలకవర్గం నిర్ణయం తీసుకుంది. కానీ అధికారులు సకాలంలో టెండర్లు పిలిచి, జిమ్‌ను అందుబాటులోకి తీసుకురావడంలో పూర్తిగా వైఫల్యం చెందారు.

శిథిలావస్థకు చేరిన పరికరాలు

నగరపాలక సంస్థ జిమ్‌ను 1999 మార్చి 14న ఏర్పాటు చేశారు. 2012 ఏప్రిల్ 8న ఎంపీ నిధులు రూ.6 లక్షలతో అప్పుడు ఎంపీగా ఉన్న అనంత వెంకటరామిరెడ్డి జిమ్‌ను ఆధునీకరించేలా చర్యలు తీసుకున్నారు. గతంలో రోజూ జిమ్‌ను 200 మంది పురుషులు, మహిళలు వినియోగించుకునే వారు. ఉద్యోగులు, సీనియర్ సిటిజెన్స్ రెగ్యులర్‌గా వచ్చేవారు. ఉదయం, సాయంత్రం షిఫ్టులలో ప్రజలు వినియోగించుకునే వారు. పురుషులు, మహిళలకు ప్రత్యేకంగా గదులు ఉండేవి. ప్రత్యేక గదులు ఉండటంతో మహిళలు కూడా జిమ్‌కు వచ్చేందుకు ఆసక్తి చూపేవారు. జిమ్‌లో రూ.లక్షలు విలువ చేసే ఖరీదైన పరికరాలు మూలకు పడ్డాయి. వాటిని వినియోగించక ఏళ్లు గడుస్తున్నాయి. ఇలాగే ఉంటే కొన్ని రోజులకు పరికరాలను గుజరీకి వేసుకునే పరిస్థితి లేకపోలేదు. నగరం నడిబొడ్డున ఉండే జిమ్ ఎంతో మందికి ఉపయోగపడుతుంది. కానీ నగరపాలక సంస్థ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. నూతన జిమ్‌కు ఎప్పుడు మోక్షం లభిస్తుందో అర్థం కావడం లేదు.

చర్యలు తీసుకుంటాం



నగరపాలక సంస్థ జిమ్‌ను పరిశీలిస్తాం. నూతన భవనం ఏర్పాటు చేస్తున్నట్లు గతంలో తెల్సింది. మరోసారి జిమ్‌ను చూసి, టెండర్లు పిలిచే విధంగా చర్యలు తీసుకుంటాం. నగర ప్రజలకు జిమ్‌ను అందుబాటులో తీసుకువచ్చేలా అధికారులకు ఆదేశిస్తాం.

\- పీవీవీఎస్ మూర్తి, మునిసిపల్ ఆర్డీ, కమిషనర్, నగరపాలక సంస్థ

సంస్కృతిని భావితరాలకు అందిద్దాం



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న సామవేదం షణ్ముఖ శర్మ

అనంతపురం కల్చరల్: సనాతన భారతీయ సంస్కృతి సంప్రదాయాల విశిష్టతను భావితరాలకు అందించడం మన కర్తవ్యమని ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. అనంత వేదికగా ఐదు రోజుల పాటూ సాగే ప్రవచనంలో భాగంగా నగరానికి వచ్చిన ఆయన శనివారం పలుచోట్ల జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొని అనుగ్రహభాషణం చేశారు. రెండవ రోడ్డులోని శ్రీ జ్ఞాన పీఠం మధుసూదనరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ధార్మిక, సామాజిక సేవా కార్యక్రమాలతో స్ఫూర్తినందిస్తున్న పీఠం సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు షణ్ముఖశర్మకు 'జ్ఞానదీపశిఖ' బిరుదుతోనూ, గోటేటి శ్రీనివాసరావుకు 'శ్రీవిద్యాభాస్కర' బిరుదులతో దంపతసమేతంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీజ్ఞానపీఠం ద్వారా ముద్రించిన శ్రీసపర్య కదంబం, గురు సపర్య , త్యాగరాజ సౌరభం, అంతర్జార అనే పుస్తకాల ఆవిష్కరణ ఘనంగా జరిగింది.

కనుల పండువగా శోభాయాత్ర

సాయంత్రం రామకృష్ణ సేవా సమితి వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా నగరంలో భారీ ఎత్తున శోభాయాత్ర నిర్వహించారు. వెండిరథంపై షణ్ముఖశర్మను ఊరేగింపుగా తీసుకువచ్చారు. దేవరకొండ కౌసల్య శిష్యబృందాల కోలాటంతో ఆకట్టుకున్నారు. నాట్యాచార్యులు సంధ్యామూర్తి శిష్యబృందం ప్రదర్శించిన శివపదం నాట్య కళారూపం భక్తిభావం ఉట్టిపడేలా సాగింది. అనంతరం షణ్ముఖ శర్మ శివసాక్షాత్కారం అనే అంశంపై మహాశివుని లీలా విశేషాలను తెలియజేశారు. రామకృష్ణ సేవా సమితి, ఇన్నర్‌వీల్ ప్రతినిధులతో పాటూ పలు ఆధ్యాత్మిక, కళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏఓకు ఆత్మీయ వీడ్కోలు



ఏఓ అంజన్‌బాబును సన్మానిస్తున్న డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి

అనంతపురం అర్బన్: బదిలీపై నంద్యాల జిల్లాకు వెళ్తున్న కలెక్టరేట్ పరిపాలన అధికారి (ఏఓ) అంజన్‌బాబుకు కార్యాలయ అధికారులు, ఉద్యోగులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి అంజన్‌బాబును శనివారం ఆయన చాంబర్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో బదిలీపై జిల్లాకు విచ్చేసిన అంజన్ బాబు కలెక్టరేట్ పరిపాలన అధికారిగా అమూల్యమైన సేవలు అందించారన్నారు. జిల్లాలో తక్కువ వ్యవధి పని చేసినప్పటికీ ఉత్తమ పాలన సాగించారని కొనియాడారు. అనంతరం అంజన్‌బాబును కార్యాలయ సిబ్బంది పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, కార్యాలయ సిబ్బంది ఆంజనేయులు, లీలాకాంత్, సురేఖరావు, రేఖ, భరత్ పాల్గొన్నారు.

కుక్కల బెడదకు పరిష్కారం చూపాలి



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలో కుక్కల బెడదపై ప్రజల నుంచి అధిక సంఖ్యలో ఫిర్యాదులందుతున్నాయి. తక్షణం పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని మునిసిపల్ ఆర్డీ, నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీఎస్ మూర్తిని మేయర్ వసీం ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. కుక్కల సమస్యను సీరియస్‌గా పరిగణించాలన్నారు. కుక్కలకు స్టెరిలైజేషన్ చేయించి, ఉత్పత్తి తగ్గించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో లైట్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. టెండర్ ప్రక్రియ ఎంత వరకు వచ్చిందని ఇంజినీర్లను ప్రశ్నించారు. త్వరలోనే లైట్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని ఈఈ సూర్యనారాయణ పేర్కొన్నారు. తాగునీటి సమస్య రానివ్వకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పార్కులను శుభ్రంగా ఉంచేలా చూడాలని తెలిపారు. వర్షాకాలంలో పూడికతీత పనులను ముమ్మరం చేయాలన్నారు. పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. నగరాభివృద్ధికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, అదనపు కమిషనర్ శ్రీహరి బాబు, తదతరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలను ఎలా ఆక్రమిస్తారు?



టీడీపీ నాయకులు తొలగించిన పునాదులను చూపుతున్న ప్రజా ప్రతినిధులు, నాయకులు

ఆత్మకూరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలు, కుల, మతాలతో సంబంధం లేకుండా కేవలం అర్హతే ప్రామాణికంగా ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు కూడా మంజూరు చేశారని ప్రజాప్రతినిధులు తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడవకనే ఇళ్ల స్థలాలను ఆక్రమిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను పరిశీలించారు. టీడీపీ నాయకులు దౌర్జన్యంగా జేసీబీలను పెట్టి శుభ్రం చేసి ఇళ్ల స్థలాలను ఆక్రమించుకోవడం సరికాదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాల్లో వారు తమ ఆర్థిక స్థోమతను బట్టి కొంత మంది ఇళ్లు నిర్మించుకున్నారని తెలిపారు. మరి కొంత మంది పునాదులు తీసుకున్నట్లు పేర్కొన్నారు. టీడీపీ నాయకులు రెవెన్యూ అధికారుల సహాయంతో జేసీబీలను పెట్టి స్థలాలను ఆక్రమిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన పట్టాలు చెల్లవు అంటూ స్థలాలను ఆక్రమిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా ఇళ్ల స్థలాలు కావాలంటే రూ.10 వేలు ఇవ్వండి వదిలేస్తామని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన పట్టాలను ఆక్రమిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, వైస్ ఎంపీపీ నీలిమ, విజయ్ సర్పంచులు రేణుకమ్మ, ఎర్రిస్వామి, ఓబులేసు, ఎంపీటీసీలు పోతులయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు వన్నూరప్ప , అంజినప్ప, రాము నాయక్, రవి నాయక్, ఎర్రిస్వామి, కో–ఆప్షన్ మెంబర్ మన్సూర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏడు శనివారాల వ్రతం



వ్రతం ఆచరిస్తున్న మహిళలు

అనంతపురం కల్చరల్: లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న ఏడు శనివారాల వ్రతాలు నగరంలోని పలు చోట్ల వైభవోతంగా జరిగాయి. శ్రీవారి నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. ముఖ్యంగా రాంనగర్, ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో మహిళలు ఏకరూప వస్త్రాలతో బారులు తీరి భక్తిశ్రద్ధలతో వ్రతం ఆచరించారు. శ్రీవారి ప్రతిమలకు పసుపు, కుంకుమ, పవిత్ర జలాలు, పుష్పాలతో పూజలు నిర్వహించారు. ఒక్కసారిగా వెలిగించిన దీపాలతో ఆలయ పరిసరాల దేదీప్యమానమయ్యాయి. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ జరిగింది. అంతకు ముందు మూలవిరాట్టుకు సుప్రభాత సేవ, తిరుమంజన, తోమాల సేవ, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. మహా మంగళహారతి అనంతరం తీర్థప్రసాద వినియోగం జరిగింది.

పూడికతీత పనుల పరిశీలన

అనంతపురం మెడికల్: పూడికతీత పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని మునిసిపల్ ఆర్డీ, నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీఎస్ మూర్తి పేర్కొన్నారు. శనివారం నగరంలోని సంగమేష్ థియేటర్ వెనుకవైపు ఉన్న మరువవంకలో జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. పనులను నాణ్యతగా చేపట్టేలా చూడాలన్నారు. ఏఈ తదితర అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. అదేవిధంగా నగరంలోని చిన్న, పెద్ద కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సూర్యనారాయణ, డీఈ సుభాష్ చంద్రబోస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పౌరుడూ ప్రాణ రక్షకుడే



సీపీఆర్‌పై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సేవలందించే ప్రతి పౌరుడూ ప్రాణ రక్షకుడే. గుండెపోటుతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సీపీఆర్ అత్యవసర పద్ధతి ద్వారా ప్రాణం పోయవచ్చని ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో విధులు నిర్వర్తించే సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. గతంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం షిల్లాంగ్‌లోని ఏఐఎంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. గుండెపోటుతో హఠాత్తుగా నేలకూలారన్నారు. ఒక వేళ ఆయనకు సీపీఆర్ చేసి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదేమో అన్నారు. సీపీఆర్ ప్రాముఖ్యతను తెలియజేయాలన్న ఉద్దేశంతో ప్రతి పౌరుడు దేశ రక్షకుడు అనే నినాదంతో ఐఆర్‌సీఎఫ్ ఆధ్వర్యంలో నేషనల్ సీపీఆర్ వీక్‌ను జూలై 21 నుంచి 28 వరకు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అనస్తీషియా హెచ్ఓడీ డాక్టర్ నవీన్ సీపీఆర్‌పై ప్రాక్టికల్‌గా సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, ఎమర్జెన్సీ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నూరుల్లా ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

మీటర్ రీడర్లకు అన్యాయం చేయొద్దు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్

అనంతపురం అర్బన్: విద్యుత్ మీటర్ రీడర్లకు ప్రభుత్వం నిర్ణయించిన ధర ఇవ్వకుండా కాంట్రాక్టర్లు వారి కడుపులు కొడుతున్నారని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ మండిపడ్డారు. ప్రభుత్వం నిర్దేశించిన ధర ఇవ్వకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. శనివారం స్థానిక నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో మీటర్ రీడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్‌గౌడ్ మాట్లాడుతూ.. మీటర్ రీడర్లకు ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం ఒక బిల్లుకు రూ.3.50 ఇవ్వాల్సి ఉందన్నారు. అయితే నగరంలో ఒక బిల్లుకు రూ.2.50, రూ.3.00 ఇస్తున్నారన్నారు. ఇలా కాంట్రాక్టర్లు పీస్ రేట్ తక్కువ ఇవ్వడమే కాకుండా రీడర్లకు వచ్చే మొత్తం కాకుండా కొంత తక్కువగా వారి ఖాతాల్లో వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మంది రీడర్లకు ఈపీఎఫ్ చెల్లించడం లేదన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, నగర అధ్యక్షుడు చిరంజీవి, ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, మీటర్ రీడర్ల సంఘం జిల్లా కార్యదర్శి రాము, ఇతర నాయకులు రషీద్, విజయభాస్కర్, షాష, కళ్యాణ, విజయ్‌కుమార్, భరత్‌కుమార్, రీడర్లు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించకపోతే ఎలా?



మాట్లాడుతున్న ఎంపీపీ హేమలత

ఆత్మకూరు: ప్రభుత్వం మారితే అధికారుల అలవాట్లు మారుతాయా? ప్రజా ప్రతినిధులకు ప్రొటోకాల్ పాటించకపోతే ఎలా అని ఎంపీపీ హేమలత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రతి సారి దాదాపు మూడు గంటలు పాటు కొనసాగే సర్వసభ్య సమావేశం ఈ సారి మాత్రం కేవలం 30 నిమిషాల్లోనే పూర్తి కావడం ఆశ్చర్యం. అధికారులు తమ శాఖలకు సంబంధించిన విషయాలను తెలియజేసి కూర్చున్నారు. మరి కొంత మంది అధికారులు మాత్రం సమావేశానికి హాజరు కాకుండా వారి కింద స్థాయి అధికారులను సమావేశానికి పంపడంతో సమావేశం కాస్త నీరుగారి పోయింది.

సమస్యలను పరిష్కరించాలి

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఫాగింగ్ చేయించాలన్నారు. మురుగు కాలువలు శుభ్రం చేయించాలని కోరారు. రైతులకు సీసీఆర్‌సీ కార్డులు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పొలాలకు విద్యుత్ సరఫరా సరిగా లేదని.. ఆటంకం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని సర్పంచులు కోరారు. ఆన్‌లైన్‌లో ఇచ్చిన పట్టాలను రద్దు చేయరాదని ప్రజాప్రతినిధులు తెలిపారు. సబ్సిడీ షెడ్లకు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని వెటర్నరీ అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దశరథ రామయ్య, వైస్ ఎంపీపీలు నీలిమ, విజయ్‌కుమార్ నాయక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ సెక్రటరీలు అధికారులు పాల్గొన్నారు.

లోకేష్ హామీ నిలబెట్టుకోవాలి



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రతిపక్షంలో ఉన్నపుడు నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సందర్భంగా అధికారంలోకొస్తే ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని పునఃప్రారంభిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పునఃప్రారంభించాలని కోరుతూ శనివారం విద్యార్థులతో కలిసి ఇంటర్ ఆర్ఐఓ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ మొదటి అసెంబ్లీ సమావేశాల్లో జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అంశంపై విద్యాశాఖ మంత్రి, ఈ జిల్లాకు సంబంధించిన ఎమ్మెల్యేలు కనీసం మాట్లాడకపోవడం దౌర్భాగ్యమన్నారు. కరువుకు నిలయంగా మారిన అనంతపురం జిల్లాలో పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలు ఎక్కువమంది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకుంటున్నారన్నారు. వెంటనే మధ్యాహ్న భోజన పథకాన్ని పునఃప్రారంభించి విద్యార్థుల ఆకలి తీర్చాలని డిమాండ్ చేశారు. అలాగే ఇంటర్ విద్యార్థులందరికీ పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా బాలికల కన్వీనర్ రజిత, జిల్లా ఉపాధ్యక్షులు తరిమెల గిరి, సిద్దు, జిల్లా సహాయ కార్యదర్శి సూర్య ప్రకాష్, నాయకులు సోము, గణేష్, మహేష్, సాయి, వరుణ్, అరవింద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్ద సరిగెత్తు



పాతూరులో భక్తుల సందడి

అనంతపురం కల్చరల్: గత పది రోజులుగా సాగుతున్న చిన్నపీర్ల వేడుకలు శనివారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ జరిగాయి. పాతూరు వీధులు పీర్ల ఊరేగింపులతో రద్దీగా మారాయి. సంప్రదాయ మేళతాళాలు, డప్పు చప్పుళ్ల మధ్య పీర్ల స్వాముల నామస్మరణతో మార్మోగాయి. బెంగళూరు రోడ్డులోని మస్తాన్‌వలీ పీర్లు, నాల్గవ రోడ్డులోని హజరత్ సయ్యద్ మస్తాన్‌వలీ పీర్లు, పెనుకొండ బాబయ్య పీర్లు, ఐదవ రోడ్డు బీబీ ఫాతిమా మకానం పరిసరాలు జనసంద్రంగా మారాయి. అంతకు ముందు సర్వాంగ సుందరంగా అమ్మవారి పీర్లను అలంకరించి పానకాలను ఊరేగించారు. భక్తులు అడుగడుగునా చక్కెర చదివింపులు చేయించి, హారతులు పట్టారు. పీర్ల ఉత్సవాల్లో ప్రధానమైన అగ్నిగుండ ప్రవేశం, జలధి కార్యక్రమాలు ఆదివారం జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈనెల 30న బీబీ ఫాతిమా చివరి దర్శనం ఉంటుందని పేర్కొన్నారు.

రాప్తాడులో నేడు జలధి

రాప్తాడు: మండల కేంద్రంలో శనివారం పెద్ద సరిగెత్తును భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు హిందువులు, ముస్లింలతో చావిడి కిటకిటలాడింది. భక్తులు పానకాల దుత్తలను చావిడి వద్దకు వచ్చి పీర్లను దర్శించుకుని చదివింపులు చేయించారు. మొక్కుబడి ఉన్న భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు పీర్ల గుండంలోకి చెట్లను ఎద్దుల బండ్లు, ట్రాక్టర్ల సహాయంతో తీసుకువచ్చి వేశారు. పెద్ద పెద్ద చెట్లు, మొద్దులను గుండంలోకి వేసే ప్రక్రియను పిల్లలు ఆసక్తిగా తిలకించారు. కొంత మంది భక్తులు గుండంలోకి కొబ్బరి చిప్పలు, బెల్లం వేశారు. బెంగళూరు నుంచి ప్రత్యేకంగా తెప్పించిన పూల దండలతో పీర్ల దేవుళ్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు చేశారు. ఆదివారం ఉదయం 8 గంటలకు పీర్ల దేవుళ్లను అగ్నిగుండ ప్రవేశం చేయించనున్నట్లు ముల్లాసాహెబ్ పీరా తెలిపారు. సాయంత్రం జలధి కార్యక్రమం ఉంటుందన్నారు.



సయ్యద్ బాబాసర్దార్ వలి స్వామిని ఊరేగిస్తున్న భక్తులు



రాప్తాడులో కొలువుదీరిన పీర్లు



గుండంలోకి మొద్దులను తరలిస్తున్న దృశ్యం